# జిరున్ర. . .

**ఉదయం** పదకొండు గంటల దాకా అయింది. హైదరాబాదు నీలపు వాహన కాలుష్యం శీతాకాలం జల్లెడతో రాష్ట్ర విధానసభ మీద పరుచుకుంది.

పచ్చటి లుంగీ మీద గాంధీజీ రాత్రి మంచుకి తడిసిపోయి మెరుస్తున్నారు. శాసన సభలో అప్పుడే కాంగ్రెస్ పక్ష నాయకుడు కాసా సుబ్బారెడ్డిగారి నాయకత్వంలో కాంగ్రెస్ సభ్యులందరూ వాకౌట్ చేశారు.

మజ్లిస్‌సభ్యుడూ, ఇద్దరు సిపిఐఎం సభ్యులూ, ముగ్గురు మామూలు సిపిఐ సభ్యులూ, అయిదుగురు బిజెపి వారూ కాక మిగతా అధికార పార్టీ సభ్యుల్లో కొద్దిమంది ఉండిపోయారు. ముఖ్యమంత్రి ముఖంలో రిలీఫ్ స్పష్టంగా కనిపిస్తోంది. ("రెడ్డిగారూ, దయచేసి అభివృద్ధిని మాత్రం అడ్డుకోకండి") స్పీకర్ ఎస్‌వికెఎస్‌ఆర్‌డబ్ల్యు ఎల్ రాజుగారు కాసిని మంచినీళ్లు తాగి ఎజెండాలో మరో అంశాన్ని పరికించారు. సన్న చిన్నకారు రైతులకి నెలకి కొంత జీవనభృతి ఇచ్చి వారి భూముల్ని వాణిజ్యపంటల నిమిత్తం కంపెనీలకు కాంట్రాక్టు ఇవ్వాలనే ప్రతిపాదన మీద తెలుగు దేశం సభ్యుడి ప్రసంగం ప్రారంభం అయింది. రెండు నిమిషాలు విని ముఖ్యమంత్రి తన గదిలోకి వెళ్లిపోయారు. మరో పది నిముషాల తరవాత స్పీకరు రాజుగారికి కూడా ఛాంబర్‌లోకి వెళిపోవాలని పించింది. ఆయన మనసంతా రాత్రి విమానంలో అమెరికా వెడుతోన్న అల్లుడి మీద ఉండిపోయింది. మనసు శాసనసభ వేపు వచ్చేసరికి తెలుగు దేశం సభ్యుడు సన్న చిన్నకారు రైతులు భూములు పోగొట్టుకున్న తరవాత ఎంతో సుఖంగా ఉంటారని హామీ ఇస్తున్నాడు. ("నేనూ రైతునే అధ్యక్షా")

కేంటీన్‌లో వేడివేడి టీ ఎనిమిదోసారి తాగి బిజెపి పార్థసారథి లేచేడు. సభవేపు నడుస్తూ వెనక్కి తిరిగిచూడ్డగానే పెద్దిరాజుగారు కనిపించారు. పలకరింపుగా నవ్వే రాయన.

"ఏవిటలా ఉన్నారు?"

"జలుబు. చచ్చిపోతుల్లా. తలంతా దిమ్ముగా ఉంది. ఏం జెప్ప మల్టారు."

"హాయిగా వెళ్లి పడుకోవచ్చు గదా. రాత్రికి కొంచెం వేడి కాఫీ మీద పల్చగా బ్రాందీ వేసుకుని తీసుకోండి. జలుబు ఎగిరిపోతుంది."

"అవల్లీ అయిపోయాయి. బ్రాంది కూడా అయిపోయింది. రూంలో పడుకుల్లా తోచదు. కాసేపు కూచుని పోదావలి."

"నిజవేలెండి. దేశాన్ని నాశనం చెయ్యడానికి మీ మిత్రులు కొత్త ప్రతిపాదన ఏదో పెడతన్నారుగా, విని పోదరు గాని."

పార్ధసారధి ముక్కు ఎర్రగా ఉంది. కళ్లు నీళ్లు కారుస్తున్నాయి. తల ఒంచినా ఒంచకపోయినా ముక్కులోంచి ధార ఆపడంఅతని వల్లకావడం లేదు. మనిషి తీవ్రమైన జలుబులా ఉన్నాడు. తలుపుతోసుకుని ఇద్దరూ లోపలికి వెళ్లేరు. సిపిఐ రాఘవరెడ్డిగారు మాట్లాడుతున్నారు. యధాలాపంగా ఇద్దరూ ఆయన వెనక సీట్లో కూచున్నారు. తల వెనక్కివాల్చి కళ్లు మూసుకున్నాడు పార్ధసారధి. రెడ్డిగారి మాటలేవీ అతనికి సరిగా వినిపించడం లేదు. 'పెట్టుబడిదారీ', 'రైతుకూలీలు', 'మాడిన కడుపులూ', 'సన్నకారు రైతుల ఉసురూ', 'ప్రభుత్వ దమననీతి' వంటివేవో పార్ధసారధి తల మీంచి జారి తడిసి కింద రాల్తున్నాయి. పెద్దిరాజుగారు పార్ధసారధి చెవులో ఏదో అన్నారు. తల జాగ్రత్తగా నీటి కుండలా ఊపేడతను. రెడ్డిగారు మంచినీళ్లు తాగుతూండగా పెద్దిరాజుగారు వెళ్లిపోయారు. ప్రభుత్వానిగానీ, దాన్ని నడిపిస్తోన్న స్వార్ధ భూస్వామ్య శక్తుల్నిగానీ ఎట్టి పరిస్థితుల్లోనూ చరిత్ర క్షమించదని స్పష్టంచేసి రెడ్డిగారు కూచున్నారు. ముఖం ఉత్తరీయంతో తుడుచుకుంటూ వెనక్కి తిరిగి పార్ధసారధిని చూశారు రెడ్డిగారు. జలుబుగా నవ్వేడు పార్ధసారధి. ఇంక లాభంలేదు వెళ్లిపోవడం మంచిదనే నిర్ణయానికి వచ్చేడతను. ఇంత జలుబుతో సన్నకారు రైతులకి తన వంతు సహాయంచేసే దేవీ లేదు. లేచే ప్రయత్నంలో సీట్లోంచి ముందుకి ఒంగే డాయన. కుండ ఒంచినట్టుగా అసంకల్పితంగా ముక్కులోంచి ధారలు శాసనసభలో జారేయి. చటుక్కున జేబులో చెయ్యిపెట్టేడు. అప్పటికే తడిసిపోయిన రుమాలు కేంటీన్‌లో మర్చిపోయాడు. రెండు కణతలూ నొక్కుకుంటూ అటూ ఇటూ చూశాడతను. పారిపోతే తప్ప మార్గం లేదు. కానీ ఎలా? ధార ఆగడం లేదు. అలా ఒంగునే తలెత్తి చూశాడు పార్ధసారధి. రాఘవరెడ్డిగారి ఉత్తరీయం భుజం మీంచి సీటు మీదుగా మెత్తగా తెల్లగా ఆకర్షణీయంగా వెనక్కి వేలాడుతోంది. పార్ధసారధి నిస్సహాయంగా ఉత్తరీయం అంచు అందుకుని ముక్కు గట్టిగా నిశ్శబ్దంగా నొక్కుకుని రెడ్డిగారి ఉత్తరీయాన్ని తడిపి జాగ్రత్తగా ఒదిలి వెనక్కి వాలేడు. వెంటనే అతని గుండెల్లో రాయిపడింది. దిక్కుమాలిన టీవీ కెమెరాలు చూడలేదు గదా? కాళ్లూచేతులూ చల్లబడ్డాయి. రాఘవరెడ్డిగారు చటుక్కున వెనక్కి తిరిగి ఉత్తరీయం తీసుకుంటూ చిన్నగా నవ్వేరు. పార్ధసారధి కాలి మడమనుంచి విషాదంగా నిట్టూర్చాడు. రెడ్డిగారికి సన్నకారు రైతుల్లాగే కొంచెం ఆకలిగా ఉండడం చేత లేచేరు. ఉత్తరీయం లాక్కుని చెంగుతో ముఖం తుడుచుకున్నా రాయన. పార్ధసారధి

గట్టిగా కళ్లు మూసుకున్నాడు గానీ లేవలేక పోయాడు. నుదుట విభూతిలా తడి అయిపోవడంతో ఉత్తరీయం వేపు చూసుకున్నారు రెడ్డిగారు. ఎందుకో వెనక్కి తిరిగి పార్థసారథి ముక్కునీ, ఉత్తరీయాన్నీ పోల్చి చూసి నిశ్చేష్టుడైపోయాడాయన. పార్థసారథి అదోరకమైన చిరునవ్వు నవ్వేడు. కాళ్లకి ప్రాణం వచ్చి తలుపువేపుకి గబగబ వెడుతోన్న పార్థసారథి వీపుకి రాఘవరెడ్డిగారు వేసిన "అధ్యక్షా" అన్న కేక ఇటుకలా తగిలింది.

. . .

ఊపిరి పీల్చినా గట్టిగా చీదిన శబ్దంలా వినిపిస్తోంది. సభాపతి ఎస్‌వికెఎస్ఆర్ డబ్ల్యుఎల్ రాజుగారు కళ్లు మూసుకుని మునివేళ్లతో టేబిలు మీద మృదువుగా దరువుతున్నారు. ఆయన టేబిలు చుట్టూ కాంగ్రెస్ సుబ్బారెడ్డిగారూ, సిపిఐ, సిపిఐఎం, తెలుగుదేశం, బిజెపి మొదలైన పార్టీ ప్రతినిధులూ పార్థసారథీ కూచున్నారు. అప్పటికి గంటన్నరనుంచీ సాగుతున్న చర్చ చూయింగ్‌గమ్‌లా సాగి తిరిగి నాలుకల మీదికి పోయింది. పార్థసారథి ముక్కుకి అడ్డంగా లుంగీకి చిన్నది, తువాలుకి పెద్దదీ అయిన గుడ్డ పెట్టుకుని టేబులు అంచుని ధ్యానిస్తున్నాడు. ముందు స్పీకరుగారికి నవ్వాలనిపించింది. కానీ సిపిఐ సభ్యుల ముఖం చూసి విరమించుకున్నా రాయన. శాసనసభా కార్యక్రమాలు స్తంభించిపోయి ఒకరోజు దాటిపోయింది. ముందురోజు పార్థసారథి వెళ్లిపోయాడు. రాఘవరెడ్డిగారు తడిసిన ఉత్తరీయాన్ని ఒక చేత్తో, జిగటగా ఉన్న నుదుటిని మరో చేత్తో పట్టుకుని "అధ్యక్షా" అని ఆర్తనాదంచేశారు. ఉలిక్కిపడ్డారు సభాపతిగారు.

"అధ్యక్షా. పాయింట్ ఆఫ్ ఆర్డర్."

అప్పటికి తేరుకుని రాజుగా రన్నారు.

"జరుగుతున్న చర్చకీ మీ పాయింట్ ఆఫ్ ఆర్డర్‌కీ సంబంధం లేదు. సీనియర్ సభ్యులై ఉండి ఇలా చెయ్యడం భావ్యం కాదు."

"అధ్యక్షా, అసలీ సభలో సభ్యులకి రక్షణ ఉందా లేదా అని అడుగుతున్నాను. ఇది శాసనసభా అడవా?"

సభాపతితోపాటు ఉన్న కొద్దిమంది సభ్యులెవరికీ సమస్య అర్థం కాలేదు. తెలుగు దేశం సభ్యుడొకరు మాట్లాడే లోపల సభాపతిగారు అన్నారు:

"చూడండి రెడ్డిగారూ మీ ముఖం చూస్తే ఎందుకో క్షోభపడుతున్నారనిపిస్తోంది. సభా కార్యక్రమాలు మీమీద గౌరవంతో అయిదు నిముషాలు వాయిదా వేస్తున్నాను. దయచేసి ఏం జరిగిందో చెప్పండి."

పొడిగా వున్న కొంగుతో ముఖాన్ని,చేతినీ గట్టిగా తుడుచుకునీ సెక్యులర్ బలాన్ని పుంజుకుని రాఘవరెడ్డిగారు అన్నారు:

"అధ్యక్షా, ఇది మామూలు కుట్ర కాదు. కుట్రతో నన్ను మట్టుపెట్టినా ఈ దేశంలో రైతుకూలీ దళితబహుజన ఉద్యమం ఆగదని మనవి చేస్తున్నాను. ఇది ఘోరమైన నీచమైన పిరికిపందల చర్య అధ్యక్షా. మమ్మల్ని వీధుల్లో, సభలో ఎదుర్కోడం చాతకాక నీచంగా అవమానించారు అధ్యక్షా."

"రెడ్డిగారూ, క్షమించాలి. మీరు ఇటీవలే మాస్కోలో బైపాస్ చేయించుకున్నారు. దయచేసి ఆవేశపడకండి. విషయం చెప్పండి. లంచ్ అవర్ దగ్గరపడింది."

"అధ్యక్షా, నాకు జరిగిన అవమానం నాదికాదు. కులతత్త్వం, మనువాదం, మతతత్త్వం, హిందూత్వం నీచంగా సెక్యులర్ అభ్యుదయ ప్రజాస్వామ్యవాదులందరి మీదాపెట్టుదారీ రివిజనిస్టు బిజెపి వారి దాడి. చూడండి అధ్యక్షా ఈ ఉత్తరీయం చూడండి. మనువాదం, హిందూత్వం ఎంత విచ్చలవిడిగా సిగ్గులేకుండా చేసిన కవ్వింపు చర్య. మీరు ఉత్తరీయం ముట్టుకుని చూడండి అధ్యక్షా."

సభాపతిగారి దగ్గిరికి రెడ్డిగారు ఉత్తరీయాన్ని ఒంటికి దూరంగా ఉంచుకుని తీసుకెళ్లేరు. రాజుగారు ఉత్తరీయం కొంగుని ఆసక్తిగా అందుకోబోతూ కొల్లేటి పెద్దింటమ్మ వారి హెచ్చరికతో చటుక్కున చెయ్యి వెనక్కి తీసుకున్నారు. తరువాత జరిగినశాసనసభా కార్యక్రమం అంతా టీ.వీ కెమేరాలు రాష్ట్రప్రజలకి రంగుల్లో అందచేశాయి. సభలో అనూహ్యమైన జలుబు తుఫాను చెలరేగింది. భోజనానంతర సమావేశంలో బిజెపి పక్ష నాయకుడికి మాట్లాడ్డానికి అనుమతి లభించింది. విధిలేక ముఖ్యమంత్రిగారు సభలో కూచున్నారు.

"అధ్యక్షా, జరిగినదానికి చింతిస్తున్నాం. మా సభ్యుడు పార్ధసారధిగారు మొదటిసారిగా ఎన్నికైన సభ్యుడు. అందువల్ల అనుభవం లేక జరిగిన పొరబాటు తప్ప సభాగౌరవాన్ని మంటగలపాలనీ, మార్క్సిష్టు, లెనినిష్టు, మావోయిష్టు, ప్రగతిశీల, ప్రగతివాద, అభ్యుదయ, సెక్యులర్ శక్తులను అవమానించాలనిగానీ చేసిన పని కాదని మనవి చేస్తున్నాను. పార్ధసారధిగారు క్షమాపణలు చెప్పడానికి సిద్ధంగా ఉన్నారు. అక్ష్యక్షా, దీన్ని అనవసరంగా మన సంస్కృతిని అవమానించే పద్ధతిలో మాత్రం చెయ్యొద్దని కోరుతున్నాను. చాలా బాధగా ఉంది అధ్యక్షా. మన సంస్కృతిలో, వేదాల్లో రైళ్లున్నాయని దయచేసి మరచిపోకండి. ప్రజాస్వామ్య శక్తుల్ని తొక్కేసిన కాంగ్రెస్, చైనాలో యువకుల్ని పొట్టన బెట్టుకున్న శక్తులూ ఇవాళ ఇలా ప్రవర్తించడం హిందూత్వాన్ని అవమానించడం, ఆత్మవంచన అని కూడా మనవి చేసుకుంటున్నా అధ్యక్షా."

సుబ్బారెడ్డిగారు మామూలుగా తోకతొక్కిన తాచులా లేచేడు.

"అధ్యక్షా, దయచేసి ఈ మాటల్ని రికార్డుల్నించి తొలగించండి, మీరు...." రెడ్డిగారి మాటలకు అడ్డువస్తూ పెద్దిరాజుగారు, ఆయన మాటలకు అడ్డొస్తూ మజ్లిస్ సభ్యుడూ, అందరి మాటలకీ శృతిలాగ సీనియర్ శాసనసభ్యురాలు ఏసురత్నం ఒకేసారి కుప్పతిప్పలుగా స్పందించారు. సభాపతిరాజుగారు లేచి సభని వాయిదా వేస్తానని బెదిరించడంతో కొంత సద్దుమణిగింది.

"సుబ్బారెడ్డిగారూ మీరు కూడా ఇట్లా మాట్లాడ్డం బాగాలేదు. మీరంతా నాతో సహకరించకపోతే ఎలా? దయచేసి కూచోండి. సభలో ముఖ్యమంత్రిగారున్నారు. వారు మాట్లాడతారు. అమ్మా, ముందు మీరు చెప్పండి." ప్రకాశం జిల్లా శాసనసభ్యురాలు, సభలో సీనియర్ అయిన ఏసురత్నం గారు లేచి నిలబడ్డారు.

"అధ్యక్షా, ఇది సభామర్యాదగాదు. ఇట్టాగే సభలు జరుపుకుంటే ప్రజలు మనమీద దుమ్మెత్తిపోస్తారు. గౌరవనీయులైన బిజెపి సభ్యుల్ని పడిశం తగ్గేవరకూ సభనుంచి బహిష్కరించమని కోరుతున్నాను. అధ్యక్షా, గౌరవనీయులు బిజెపి పక్ష నాయకులు ఇదేదో చిన్న విషయంగా భావిస్తున్నారు. అధ్యక్షా, మగవారికి కొంగులు లేకపోవడం ఇబ్బందిగా ఉంటదనీ, చీదుకోవటానికీ, మొకం తుడుచుకోటానికీ ఇదిగా ఉంటదనీ ఒక మహిళగా నాకు తెలుసు. కానీ అధ్యక్షా, ఇది అంత చిన్న విషయం కాదు. మన రాష్ట్రంలో ఉన్న దళిత క్రైస్తవ మహిళలందరి పక్షానా నే నడుగుతున్నాను. గౌరవనీయులు రాగవరెడ్డిగారి స్థానంలో నేను గానీ, మా మహిళా సభ్యులెవరేనా ఉంటే ఏం జరిగి ఉండేదో ఆలోచించండి అధ్యక్షా. అట్టడుగు వర్గాల మహిళలకు న్యాయం జరగాలి అధ్యక్షా." వెంటనే ఒక్కుమ్మడిగా తెనాలి, రాజమండ్రి, పార్వతీపురం సభ్యురాళ్లందరూ మాట్లాడేరు. చివరికి మాజీ సినీతార టస్సూర్ జలజ రెండు మాటలు మాట్లాడ్డానికి అనుమతి దొరికింది. ఆమె లేచి కుడి కనుబొమ సుతారంగా పైకితేల్చి గాద్గదికంగా అంది.

"అధ్యక్షా, ఒక స్త్రీగానే కాకుండా ఒక మహిళగా, ఒక మహిళగానే కాకుండా ఒక భార్యగా, ఒక భార్యగానే కాకుండా ఒక కళాకారిణిగా, మా నియోజకవర్గ స్త్రీల గౌరవాన్ని కాపాడే సేవకురాలిగా, నా హృదయం, మనసు, శరీరం ఒణికి ఏదో అయిపోతున్నాయి అధ్యక్షా. కానీ...."

"అమ్మా రెండు మాటలు మాట్లాడతానన్నారు గదా, మామూలుగా తెలుగులో చెప్పండమ్మా."

"థాంక్యూ సర్. నా మనసూ, హృదయం, ఆత్మా మథన పడుతుంటే ఆ బాధ చెప్పుకోవాలని ప్రయత్నిస్తున్నాను అధ్యక్షా, నేను డ్వాక్రా గ్రూపు లందరి తరఫునా

మాట్లాడుతున్నాను. గౌరవ సభ్యురాళ్లందరికీ కుల, వర్గ భేదాలు లేకుండా నాదొక విన్నపం. కులమత భేదాలకి అతీతంగా మనందరికీ కొంగులంటాయని మీకు తెలుసు. ఇకముందు భవిష్యత్తులో మన ఆత్మగౌరవం కాపాడుకోవడం కోసం, కొన్ని రాజకీయ శక్తుల పన్నాగాల్ని వమ్ము చెయ్యడం కోసం, మనం అంతా ఒకేసారి లేచి నిలబడి ఇక ముందు భవిష్యత్తులో శాసన సభలో గానీ, కేంటీన్‌ల గాని కొంగు నడుంచుట్టు బలంగా దోపుకుంటామని ప్రమాణం చెయ్యమని కోరి ప్రార్థిస్తున్నాను." మహిళా సభ్యులందరూ ఫెళ్లున కరతాళ ధ్వనులు చేస్తూ ప్రమాణ స్వీకారం చేసి వెంటనే కొంగులు దోపుకుని కూచున్నారు. సుబ్బారెడ్డిగారు లేచి అన్నారు.

"అధ్యక్షా, నేను మిమ్మల్ని ఎప్పుడూ ఏవీ అడగలేదు. కనీసం మాకు ఈ సభలో ఒక్కసారి రెండు మాటలు చెప్పే అవకాశం కూడా లేదా అధ్యక్షా! నేను మాట్లాడి తీరతాను. మతతత్త్వవాదుల విరగబాటుతనం, విచ్చలవిడితనం మేం గమనించకపోలేదు. బాబ్రీమసీదు కూలిపోయింది అధ్యక్షా. ఆ క్షణం నుంచే మతతత్త్వం పెచ్చుమీరి సెక్యులరిజం నడిబజార్లో హత్య చెయ్యబడుతోంది. ఈ దాడిని సెక్కులరిజం మీద మతతత్త్వవాదుల దాడిగా భావిస్తున్నాను. అధ్యక్షా, ఇవాళ, ఈనాడు ఈ సభలో తడి ఉత్తరీయంతో సెక్యులరిజం మొహం మొత్తేశారు అధ్యక్షా. దీనికి అధికార సభ్యుల అండదండలున్నాయి. అధ్యక్షా నేను సవాలు చేస్తున్నాను. సభలో కూచున్న ముఖ్యమంత్రి ఎందుకు మౌనంగా వున్నారు? కలేజా వుంటే ప్రజల ముందుకు రండి."

"ప్లీజ్ రెడ్డిగారూ, మీరు అసలు విషయం ఒదిలేసి మాట్లాడుతున్నారు. వియ్ వాంట్ ఎ సొల్యూషన్."

మజ్లిస్ సభ్యుడు లేచి కసిగా ఓసారి బిజెపి వారిని చూసి అన్నాడు.

"..... నాక్‌కీ అందర్ జో చీజ్ హోతీహై ఏ బహుత్......" సుబ్బారెడ్డిగారు అతన్ని మాట్లాడనివ్వలేదు.

"అదే అధ్యక్షా. దీని వెనక దుర్మార్గమైన ప్రజాస్వామ్య వ్యతిరేక శక్తులున్నాయి. ఈ సభలో ఈ చారిత్రాత్మక సభలో ఒకప్పుడు ఎంతమంది మహానుభావులు ఉండేవారో ఒక్కసారి గుర్తు చేసుకోమని హిందూత్వ శక్తుల్ని కోరుతున్నాను. అధ్యక్షా, నీలం సంజీవరెడ్డి గారు, సంజీవయ్యగారు, తెన్నేటి విశ్వనాధంగారు, వావిలాలవారు, పీ.వి.గారు ఎంతోమంది ఉన్నారు. అధ్యక్షా, ఒక్కరోజు, ఒక్కసారి వారెవ్వరూ జ[్రున చీది ఎరగరు అధ్యక్షా."

కాంగ్రెస్ సభ్యులందరూ షేమ్‌షేమ్ అని అరిచారు. సుబ్బారెడ్డిగారు కొనసాగించారు.

"దయచేసి మా గొంతులు నొక్కకండి అధ్యక్షా. మీ మీద మాకు నమ్మకం, గౌరవం.

కానీ అధ్యక్షా ముఖ్యమంత్రిగారు మౌనంగా ఎందుకున్నారో ఒక్కసారి ఆలోచించాలి. ఇప్పటికే రాష్ట్రం అప్పుల పాలైపోయింది. శాసనసభ్యుల హక్కులు కాలరాచిన సందర్భంలో ప్రజాస్వామిక విలువల్ని మర్చిపోయి అధ్యక్షా, రాజకీయ దృష్టితో ఈ సమస్యను సృష్టించారు. అధ్యక్షా. నేను సవాలు చేస్తున్నాను చెప్పమనండి. నే నిక్కడే ఉరిపోసుకుని చచ్చిపోతాను. వారిని కూడా రాజీనామా చేసి ఉరిపోసుకోమని ఛాలెంజి చేస్తున్నాను అధ్యక్షా."

తెలుగు దేశం సభ్యులు పచ్చకెరటంలా లేచి మైకులు విరిచి కూచున్నారు. సభాపతి నిస్సహాయంగా ముఖ్యమంత్రిగారి వేపు చూసి అన్నారు:

"సభానాయకుడిగా మీరు ఈ సమస్యని పరిష్కరించాలని కోరుతున్నాను. రెడ్డిగారూ కూచోండి. మీకు న్యాయం కాదు. ప్రతిసారీ మీరు ఉరేసుకునో విషంతాగో శాసనసభలో పోతాననడం న్యాయం కాదు. ప్లీజ్ ఉరేసుకునే ముందు రాజీనామా చేసి ఏం లాభం? పోనీ ఈ విషయంలో సభాసంఘాన్ని నియమిద్దాం. అందరం ఏదో ఒక రోజు పోక తప్పదు. మీరేం చిన్నవారు కాదు. మీతో బాటు మీ అనుచరులు కూడా శీతాకాలం సమావేశాల్లో ఉరేసుకుంటే ప్రజలకి మన మీద ఏం నమ్మకం ఉంటుంది. నోనో, ప్లీజ్, దయచేసి ఆ కండువా మెడచుట్టూ చుట్టుకోకండి."

"లేదు అధ్యక్షా, నేను అలవాటుగా మెడచుట్టూ వేసుకుంటున్నాను. నాది తొందర పాటు స్వభావం కాదు అధ్యక్షా. మిత్రుల్నీ, శ్రేయోభిలాషుల్నీ, పార్టీ అధిష్ఠానవర్గాన్నీ సంప్రదించి ఉరేసుకుంటాను."

ముఖ్యమంత్రిగారు లేచి నిలబడి రెడ్డిగార్ని కూచోమని సంజ్ఞ చేసి, ఒకసారి అందర్నీ విషాదంగా చూసి అన్నారు:

"అధ్యక్షా, నేను రాష్ట్రాన్ని అభివృద్ధి మార్గంలో నడిపిస్తా ఉన్నాను. దీన్ని ఆపడానికీ ఏదో విధంగా అడ్డుకోడానికీ కొంతమంది ప్రయత్నాలు చేస్తున్నారని నాకు తెలుసు. కానీ వారంతా ఒట్టి పగటి కలలు కంటున్నారని మాత్రం మనవి చేస్తున్నాను. న్యాయం ఆలోచించండి. అధ్యక్షా, జరిగిందానిలోనా కుట్ర ఉందని పెద్దలు సుబ్బారెడ్డిగారు అనడం తప్పు నాదా? ఇది కంటగింపుతో మా పార్టీ ప్రగతిశీల కార్యక్రమాల మీద బురద జల్లడం అని నేను మనవి చేస్తన్నాను. సరే అధ్యక్షా, కుట్రలో నాకు భాగం ఉందని అభాండాలు వేసి ఒప్పుకోమని బెదిరించి ఒప్పుకోకపోతే ఉరిపోసుకుంటాననంటే ఏం జెయ్యాలి? వారి కంటే తప్పదు అధ్యక్షా, కానీ రాష్ట్రాన్నీ అభివృద్ధి పదంలో నడిపిస్తా ఉంటే నన్ను కూడా ఉరేసుకోమండం ఏం ప్రజాస్వామ్యం?

కాంగ్రెస్ సభ్యులందరూ ఒక్కుమ్మడిగా లేచి నిలబడి హాహాకారాలు చేసి మిగిలిన మైకులు విరిచి కూచున్నారు. ఈ గొడవలో కొత్త సభ్యు డెవరో "సుబ్బారెడ్డి అమర్‌హై"

అనడం ఎవరో అతని నోరునొక్కడం అస్పష్టంగా సభాపతికి వినిపించింది. సభాపతి మరోమారు సభని వాయిదావేస్తానని బెదిరించడంతో సద్దుమణిగింది. ముఖ్యమంత్రిగారు కొనసాగించారు.

"నేను ఒకటే చెప్తున్నాను. అభివృద్ధికి మాత్రం అడ్డురాకండి. అధ్యక్షా, ప్రపంచ బేంకు పదివేలకోట్లు అప్పు ఇవ్వడానికి సిద్ధంగా ఉందని మీ అందరికీ తెలుసు. అటువంటి సంతోష సమయంలో....."

ముఖ్యమంత్రిగారి మాటలకు అడ్డొస్తూ పెద్దిరాజుగారు అరిచారు.

"సంతోషం దేనికి అధ్యక్షా, రాష్ట్రాన్ని అప్పులపాలు చేసినందుకా, లేకపోతే అధికారపార్టీ కాంట్రాక్టర్లు బాగుపడతారనా?"

నిజానికి మనసులో పెద్దిరాజుగారికి సంతోషంగానే వుంది. మార్క్సిస్టు దాయాది పరాభవం చూసి మావోగార్ని కావలించుకున్నంత మురిసిపోయారాయన.

ముఖ్యమంత్రిగారు మరో రెండు నిమిషాలు అభివృద్ధికీ డబ్బుకీ సంబంధం లేదని సభాపతికి విన్నవించి కూచున్నారు. సభాపతి పెద్దిరాజుగాన్ని అడిగారు.

"పెద్దిరాజుగారూ, మీరేనా క్లుప్తంగా రెండు మాటల్లో సలహా చెప్పండి."

"అధ్యక్షా, మాకు మార్క్సిస్టు, లెనినిస్టు, మావోయిస్టు పంథాలో బేధాభిప్రాయాలున్నా పెద్దలు రాఘవరెడ్డిగారికి జరిగిన అవమానం ప్రగతిశీల, లెనినిస్టు, మావోయిస్టు, అంతర్జాతీయ సెక్యులర్ వాదులందరి అవమానంగా నేను భావిస్తున్నాను. ఈ సమస్య సంకీర్ణ ప్రభుత్వాల కుళ్లుకి సంబంధించిన సమస్య అని మనవి చేస్తున్నాను. ప్రపంచ బేంకుకి రాష్ట్రాన్ని తాకట్టు పెట్టిన సందర్భంలో..."

ఆర్థికమంత్రిగారు చటుక్కున అడ్డుకున్నారు. ప్రపంచ బేంకుకీ ఈ సమస్యకీ సంబంధంలేని కారణంగా పెద్దిరాజుగారి మాటల్ని రికార్డుల నుంచీ తొలగించాలని కోరేరు. సభాపతిగారు అంగీకరించి పెద్దిరాజుగారిని కొనసాగించమని అనుమతించి సభలో సీనియర్ సభ్యురాలు ఏసురత్నంగార్ని తన స్థానంలో కూచోపెట్టి తాత్కాలికంగా నిష్క్రమించారు.

"అధ్యక్షా, ఇది మన అందరి సమస్య. కానీ ముఖ్యంగా మార్క్సిస్టు ప్రగతిశీల పార్టీల సమస్యగా నేను భావిస్తున్నాను. అందుచేత అధ్యక్షా ముల్లుని ముల్లుతోనే తియ్యాలి. ఈ సభలో ఇకముందు ఇటువంటి పెట్టుబడిదారుల దాడి జరక్కుండా మనం చెయ్యాలంటే ఒకటే మార్గం ఉంది. అధ్యక్షా, మీ ముందు మా మార్క్సిస్టు పార్టీల సభ్యులు నుంచుని గౌరవంగా మీ స్థాయికి భంగం లేకుండా బి.జె.పి.వారి మినిమమ్ కామన్ ప్రోగ్రాం

కాపీని ముందుపెట్టుకుని దాని మీద ఒకసారి చీదడం భావ్యంగా ఉంటుందని అనుకుంటున్నాను, అధ్యక్షా...”

కాం(గెస్ సభ్యులంతా బల్లలు చరిచి తమ ఐక్యతను ప్రదర్శించారు. బిజెపి సభ్యులు, తెలుగుదేశం సభ్యులు షేమ్, షేమ్ అని అరిచారు. ముఖ్యమంత్రిగారు కోపంగా సభనుంచి వెళ్లిపోయారు. ఏసురత్నంగారు తలపట్టుకుని కూచుండిపోయారు. కాంగ్రెస్ సభ్యులూ తెలుగుదేశం సభ్యులూ తిట్టుకున్నారు. ప్రగతిశీల ప్రజాస్వామిక, అభివృద్ధి కాముకులూ, ఇతరులూ ఎక్కువగా అరవడం వల్ల అలిసిపోయారు. బిజెపి వారి ముఖాలు మండుటెండలో టొమాటో పళ్లలా అయిపోయాయి. ఈ అదను చూసుకుని మార్క్సిస్టు పార్టీ సభ్యులు 'సెక్యులర్ ప్రజాస్వామ్యం వర్థిల్లాలి' అనే నినాదంలో కుడిచేత్తో ముక్కుపట్టుకుని స్పీకరు పోడియం దగ్గిరికి వెళ్లి నుంచున్నారు. పెద్ది రాజుగారు ఒక చేత్తో కామన్ మినిమమ్ ప్రోగ్రాం కాపీని ముందుకు చాపి స్పీకరు వేపు చూశారు. చటుక్కున సభాపతిగారు కొంగుదోపుకున్నారు. (“ఈళ్ల జిమ్మడిపోను. పడిశం ఎక్కువై గుల్లకమ్మలో దూకి చచ్చినా బాగుండు దేవా.”)

“దయచేసి ఆగండి” అని పెద్దగా అరిచారామె. దాంతో అసంకల్పితంగా ముక్కుల మీద చేతులు తీసేశారు. వెంటనే ఆమె “మార్షల్స్” అని మళ్లీ అరిచింది. పరిస్థితి అప్పటికే అర్థంకావడం వల్ల మార్షల్సు మార్క్సిస్టుల మీదికి లంఘించడం, ఒక చేత్తో నడుం, మరో చేత్తో ముక్కూ గట్టిగా పట్టుకుని బయటికి ఈడుచుకుపోవడం నిముషంలో జరిగిపోయాయి.

కాం(గెస్ సభ్యులందరూ మళ్లీ పెద్దగా అరిచి ప్రతిఘటించారు. సుబ్బారెడ్డిగారు సభాపతి ముందుకు దూసుకొచ్చి ప్రజాస్వామ్యాన్ని ఇలాగే ముక్కు మూసేస్తే అక్కడే అప్పుడే ఆత్మహత్య చేసుకుంటానని ప్రకటించారు. ఏసురత్నంగారు తన నిస్సహాయస్థితిని గుర్తించారు. “ఈళ్ల దివసం జెయ్య. ఇది సబా చేపల బజారా?” అని మనసులో అనుకుని అల్లకల్లోలంగా ఉన్న సభని చూశారు. ఇంకాసేపు ఇలాగే కొనసాగితే సభ్యులు ఒకళ్లమీద ఒకళ్లు చీదుకుంటారని భయపడిందామె. వెంటనే లేచి నుంచుని సభని నిరవధికంగా వాయిదా వేస్తున్నట్టు ప్రకటించి, మరోసారి కొంగు జాగ్రత్తగా చూసుకుని తన సీటు వేపు నడిచారామె.

. . .

దినపత్రికలు, టీ.వీలు శాసనసభలో జరిగిన గొడవని వర్ణనాత్మకంగా కార్టూన్లతో సహా ప్రచారంచేశాయి. ఒక ప్రఖ్యాత దినపత్రిక “ప్రజాస్వామ్యానికి జలుబు చేసింది” అనే పతాక శీర్షిక కింద రాఘవరెడ్డిగారి తడి ఉత్తరీయాన్ని రంగుల్లో ప్రచురించింది. మరోపత్రిక “శ్లేష్మంలో పడ్డ సెక్యులరిజం” అంటూ పార్థసారథి ముక్కుభాగాన్ని

ప్రచురించింది. "చీరేసిన అసెంబ్లీ" అంటూ మరో దినపత్రిక కార్టూన్ వేసింది. హైదరాబాదు ఇంగ్లీషు దినపత్రిక "ఆధునికోత్తర జలుబు" అనే పేరుతో సంపాదకీయం రాసింది.

సభాపతి రాజుగారు కళ్లు తెరిచి అన్నారు:

"ఇంకా దీన్ని పొడిగించడం మంచిదిగాదని మీ అందరికీ తెలుసు. రాత్రి మీరందరూ ఏదో ఒక పరిష్కారం గురించి ఆలోచించే ఉంటారు. దయచేసి పరిష్కారం దృష్టిలో పెట్టుకు మాట్లాడండి. పెద్దిరాజుగారూ మీరు చెప్పండి."

"సభనుంచి ముక్కులు పిండుతూ బయటికి గెంటటాన్ని ప్రతిఘటిస్తూ రాత్రి జరిగిన విషయాన్ని మీకు చెప్తాను. ఒకటి మేం నిర్ణయం తీసుకోడం అనేది ఢిల్లీ నుంచి ఏ మాటా రానిదే ఏవీ చెప్పలేం. అదట్లా ఉంచండి. రాత్రి నేను యేచూరి సీతారాం గారికి ఫోన్ చేశాను."

"ఏ వన్నారు?"

"ఆయన లేరండి. ఉంటే మన తెలుగువాడిగాసలహా చెప్పి ఉండేవారు. కానీ ఆయన డార్జిలింగ్ వేళ్లేరట. వారం వరకూ తిరిగి రారు."

"అరే. అంటే జ్యోతిబసుగారి దగ్గరికి వెళ్లేరా?"

".......ల్లేదండి. సీతారాంగారు "హృదయం, ప్రేమ" అనే పేరుతో ఇంగ్లీషులో కవిత్వం పుస్తకం రాస్తున్నారండి. ఆ పనిలో ఉండిపోయారు."

"పోనీలెండి. అందులో తప్పేవుంది?"

"అవుననుకోండి. పెద్దలు హరికిషన్‌సింగ్‌గారు కూడా దొరకలేదండి. ఆఫీసు సెక్రటరీగారు మాట్లాడేరు. నాకేం అర్థం కావడం లేదు."

"అదేంటి సార్, ఆయన కొన్ని విషయాలు స్పష్టంగానే చెప్తారు గదా"

"ఇది స్పష్టత, నిబద్ధత గురించి కాదండి. ఇటీవల కొంతకాలం నుంచీ బెంగతో ఉన్నారండి. అయిదో ఫ్రంటు ఏర్పాటు చెయ్యమని అడుగుతున్నారండి."

"అదేవిటి సార్?"

"ఏం చెప్పమంటారు. మాలాంటి వాళ్లు కనిపిస్తే కళ్లనీళ్లు పెట్టుకుని "చారిత్రక తప్పిదం" "చారిత్రక తప్పిదం" అని గొణుక్కుంటున్నా రంటండి."

"అయ్యో పాపం. అలాగని వారు పాపం విశ్రాంతి కూడా తీసుకోరు మరి."

"ఏదైనా, మాపార్టీ మిత్రుల అభిప్రాయం ప్రకారం ప్రగతిశీల, సెక్యులర్, విప్లవ, ప్రజాస్వామిక, సామ్రాజ్యవాదు లందరూ సెక్రటేరియట్ నుంచి రవీంద్రభారతి మీదుగా అసెంబ్లీ ముందువరకూ ఊరేగింపుగా రావాలంటున్నారు."

"అయ్యా, ఈ ఊరేగింపులు దేనికి చెప్పండి."

"అంటే, ఊరేగింపు ఒక్కటే కాదండి. అక్కడి నుంచి మన సభా భవనం దాకా అందరూ చీదుకుంటూ నడవాలని అనుకుంటున్నారు."

రాజుగారు ఉలిక్కిపడ్డారు. ఆయనకి కొంచెం కోపం కూడా వచ్చింది.

"చూడండి. ఇదికాదు నాక్కావలసింది." ఆయన మరోమాట మాట్లాడే లోపల పి.ఎ గారు లోపలికి వచ్చి వినయంగా ఒంగుని ఆయన చేతిలో ఒక కవరు పెట్టేరు. దాన్ని అటూ ఇటూ చూసి అన్నారు.

"ఆంధ్రప్రదేశ దళిత, బహుజన సమాఖ్య నల్లకుంట ఆఫీసు నుంచి." జాగ్రత్తగా కవరు చింపి లోపలి అరఠావు కాయితాన్ని బయటికి తీసి కళ్లజోడు సవరించుకుని చదవడం మొదలెట్టేరు. ఉత్తరం పూర్తిగా చదివేసరికి ఆయన ముఖం ఎర్రబడింది. తమాయించుకుని ఉత్తరాన్ని మరోసారి చూసి అన్నా రాయన.

"రెండుపేరాలు చదువుతాను వినండి....... కనుక మనువాదుల మతతత్త్వం, బ్రాహ్మణవాదం సహించే స్థితి రాటిపోయిందనీ, మైనారిటీలు, బహుజనులు, దళితులు, దళితులలో ఏబిసిడి వర్గాల వారూ బిజెపి ఆరెస్సెస్ కుట్రలను గమనిస్తున్నారు. అగ్రవర్ణ అహంకారం అంతం అయేరోజు వస్తోంది. దీన్ని గమనించమని కోరుతున్నాం. రాఘవరెడ్డిగారితో సిపిఐ, సిపిఐ ఎంఎల్ వారి ఆరు వర్గాలతో మాకు భేదాభిప్రాయాలున్నా ఆ అవమానం అంబేద్కరిజానికి జరిగిన అవమానంగా భావించి వారిని సమర్థిస్తున్నాం. సూర్పణఖ ముక్కుకోసినపుడూ, ఏకలవ్యుడి వేలు కోసినప్పుడూ మేం పల్లెత్తుమాట అనలేదు. కానీ ఇక సహించేది లేదు. రేపు మధ్యాహ్నం బషీర్‌బాగ్‌సెంటర్నుంచీ మైనారిటీలు, బహుజనులు అందరం కలిసి రబ్బరుతో చేసిన హిందూత్వ ముక్కుని ముక్కలుగా కోసుకుంటూ అసెంబ్లీ వరకూ ఊరేగింపుగా రావాలని నిర్ణయించుకున్నాం. అక్కడ ఆ బ్రాహ్మణవాది ముక్కుముక్కల్ని కుప్పగా పోసి తగలబెడతాం. జై భీమ్."

"శ్రీరాముణ్ని ఇట్లా అవమానించడం వేదాలకీ, మన హిందూ దేశానికీ అవమానం. దీన్ని సభాపతిగా మీరు ఆపాలి. లేదా విశ్వహిందూపరిషత్ వారే స్వయంగా కలగ జేసుకుంటారు."

"చాల్లే ఊరుకోండి. అసలీ గొడవంతా మీ వల్లే వచ్చింది. అందరూ ఆవేశంతో మాట్టాడ్డవే. ఏసురత్నంగారు చెప్పినట్టు ఇదే టస్సూర్ జలజగారికి జరిగి ఉంటే ఏవవుతుందో ఊహించారా?"

"మహిళాలోకం విరుచుకుపడుతుంది" అన్నాడు సిపిఐ సభ్యుడు.

"అదయితే నయవే. షబానా ఆజ్మీ, జయప్రద, మార్గరెట్ ఆల్వా, వీలయితే అరుంధతీరాయ్ శాసనసభ ముందు కూచుంటారు. పరిస్థితి ఆలోచించండి. రేణుకా చౌదరిగారు ఊళ్లోనే ఉన్నారు. మీకేం తెలీడం లేదు. మీరు సహకరించకపోతే సభ ఎలా నడపాలో మీరే చెప్పండి. ఆత్మాహుతి దళం వాళ్లొచ్చి బ్లేళ్లతో ముక్కులు కోసుకుంటారని రాత్రి నుంచీ భయంగా ఉంది. పెద్దిరాజుగారూ మీరు మాత్రం ఏటండీ. పాపం పెద్దావిడ. ఏసురత్నంగారు భయపడిపోయి రాత్రంతా బైబిలు చదువుకుంటూ కంటి మీద కునుకు లేదంట. చీమచిటుక్కుమంటే చీదినట్టు ఇనిపించిందంటండి. ఏబ్బే."

అంతా విని మజ్లీస్ సభ్యుడు అన్నాడు.

"సార్. వియ్ అగ్రీ విత్ యూ. కానీ ఇది మైనారిటీ వారికికూడా జరిగిన అవమానం సార్. బట్ వియ్ విల్ కోఆపరేట్ విత్ యూ. సార్ ఒక్క సలహా. ఇంక నుండీ బుఖార్ ఉంటే ఎవరూ సెషన్లకి రాకూడదని రూలింగ్ ఇవ్వండి సార్."

ఇండిపెండెంట్ సభ్యుడు రామ్మూర్తి నాయుడు మరో సలహా జోడించాడు.

"అలాక్కాదు సార్. ప్రతి సీటుకీ మెత్తగా ఉండే పెద్ద ఖద్దరు గుడ్డ ఏర్పాటు చెయ్యండిసార్. ప్రతీరోజు కొత్త గుడ్డ ఇస్తే మన చేనేత కార్మికుల ఆత్మ హత్యలు కూడా తగ్గుతాయి"

సూత్రప్రాయంగా ఈ సూచన అందరూ అంగీకరించారు. రెండోసారి అందరికీ టీలు అందేయి. సభాపతి రాజుగారు సాభిప్రాయంగా సుబ్బారెడ్డిగారి వేపు చూశారు. రెడ్డిగారు ఇబ్బందిగా కదిలి టీ చప్పరించి అన్నారు:

"మా సహకారం ఎప్పటిలాగే మీకు పూర్తిగా ఉంటుంది. సాయంకాలం గాంధీభవన్‌లో సమావేశం జరుగుతుంది. రాత్రి ఢిల్లీ అధిష్టానవర్గంతో మాట్లాడేను. సాయంకాలం విమానంలో ఉత్తరం వస్తుంది. మా తెలంగాణా నాయకులు వీరారెడ్డిగారు కూడా ఈ విషయంలో సహకరిస్తున్నారు. కానీ ముఖ్యమంత్రిగారు ఈ చర్యను ఖండించకపోవడం తీవ్రంగా పరిగణిస్తున్నాం."

ఆయన మాటలకు అడ్డు వస్తూ ఫోన్ మోగింది. స్పీకరు గారు గొంతు సవరించుకుని గంభీరంగా హాలో అన్నారు. ఒక క్షణం తటపటాయించి, "సరే ఇవ్వండి", అన్నారాయన. "హలో, నమస్కారం. ఆయ. నిజానికి పార్టీ నాయకులతో ఆ విషయమే చర్చిస్తున్నాం." దరిదాపు పది నిముషాలు రాజుగారు వింటూ ఉండిపోయారు. ఆయన ముఖం ఎరుపునుంచీ తెలుపూ, తెలుపు నుంచీ బూడిదరంగుగా మారుతూ వస్తోంది. ఫోను పెట్టేసి తల రెండు చేతులతో పట్టుకుని పార్థసారథి వేపు చూసి కళ్లు మూసుకున్నా

రాయన. పేపరు వెయిటుతో కసిదీరా పార్థసారథి ముక్కు చితక్కొట్టేయాలనిపించింది. కొల్లేరుని అందరూ ఆక్రమించి కూచున్నారుగానీ లేక పోతే ఉంటే ఉంగుటూరు వెళ్లి చేపల పట్టుకోవడం నయమనిపించింది రాజుగారికి. కొన్ని క్షణాల తరవాత ఆయనే అన్నారు.

"పౌరహక్కుల సంఘం వాళ్లు. పౌరహక్కులకీ, ఆఫ్రికాకీ, అమెరికన్ నల్లజాతి వాళ్లకీ, కుహానా ప్రజాస్వామ్య సెక్యులర్ వాదులకీఈ గొడవకీ సంబంధం ఏవిటి చెప్పండి. ప్చ్ ఏవీ లాభం లేదండి. యుఎన్ఓనీ, పార్లమెంటునీ, శాసనసభనీ, పోలీసు వ్యవస్థనీ, కుహానా ప్రాజాస్వామ్యాన్నీ ఒప్పుకోరంటండి. ఎన్కౌంటర్లకీ దీనికీ తేడా ఏవిటంటున్నారు."

సభాపతి రాజుగారు ఆగి కనుబొమలు ముడిచి ఒక వింత స్వరంతో కొంచెంగా మొహమాట పడుతూ అడిగేరు.

"అంటే రాజకీయాల్లో బడి మనకి పుస్తకాలు చదుంకునే సమయం ఉండదనుకోండి. కానీ "మౌలిక ప్రజాస్వామ్య వైవిధ్య సైద్ధాంతిక వర్గ రహిత సామాజిక సహిష్ణుత" అంటే అర్థం ఏవిటంటారు?"

కొన్ని క్షణాల నిశ్శబ్దం తరువాత ఇండిపెండెంటు నాయుడుగారన్నారు.

"అది మనిషి పేరు మాత్రం కాదు. పోనీండి. ఓసారి వర వరరావుగార్ని సంప్రదించ మంటారా?"

"ఆయ నెక్కడున్నాడండీ బాబూ. ఎక్కడో శ్రీకాకుళం జిల్లాలో యువతరం కవులకి విప్లవ కవిత్వ శిక్షణా తరగతుల నిర్వ హిస్తున్నారట. ఇంటోనూ ఉండడు, యూజీలోనూ ఉండడు" అంటూ అంత గంభీర వాతావరణంలోకూడా నవ్వొచ్చింది రాజుగారికి.

"బాలగోపాలం గారికి నాలుగు రోజుల్నించీ తీవ్రంగా జలుబు చేసి మంచం దిగడం లేదంటండి. అలాగే మొన్న గ్లోబలైజేషన్ మీద ఉపన్యాసం చెప్పి దగ్గు కూడా తెచ్చుకున్నారు. ఇయన్నీ ఫోన్లో చెప్పినవే."

బిజెపి పక్ష నాయకుడు ఉత్సాహంగా అన్నాడు.

"మన దేశీయ ఆయుర్వేదంలో దగ్గుకి అద్భుతమైన మందు ఉంది. రెండు చెంచాలు వారి చేత నాకిస్తే......"

"ఊరుకోండింక. తెలిసీ తెలీకుండా మాట్లాడతారేటండీ. అసలు మిమ్మల్నీ ఆ గోపాలంగార్నీ ఓ గదిలో పెట్టి తలుపేస్తే ఏవవుతుందో మీకే తెలుస్తుంది. ఇలా అంటున్నానని పార్టీ పరంగా మాట్లాడుతున్నాననుకోకండి. మీరు తేలప్రోలు స్కూల్లో స్కూలు ఫైనలు తప్పేరు. ఆయనగారి గొడవ మీకు తెలవదు మరి."

పెద్దిరాజుగా రన్నారు.

"పోనీలెండి. విషయం ఏవంటారు?"

"అసలదే చెబుదావనుకుంటున్నాను. పులీ మీద పుట్రలాగ ఇప్పుడు ఆ గద్దరు దీని మీద పాటలు రాసి ఎల్లుండి మధ్యాహ్నం నుంచీ పబ్లిక్ గార్డెన్సులో పాడతాడంటండి."

"అలాగా. అతని పాట విని చాలాకాలం అయింది."

"ఆ! ఆయ. మీకలాగే ఉంటుంది మరి. ఇప్పు డాయనగారు గజ్జలు కట్టుకుని పాటా దేన్సూ మొదలెడితే ఏవవుతుందో తెలుసా? జనాన్ని ఆపడానికి ఆర్మీని దింపుకోవాలి. ఓ పక్క చీదుకుంటా ఒచ్చే ఊరేగింపా, ముక్కులు కోసుకుంటూ అదో గుంపు, పక్కనే ఈనగారి పాట, అసెంబ్లీలో మీలాటి పెద్దలు చీదడం. ఏటండీ ఇది దరిద్రం గాకపోతే? ఛీ ఛీ. ఇంకా నయం. దేవుడి మీద ఒట్టేసి చెబుతున్నాను సుబ్బారెడ్డిగారూ, నిజంగా చచ్చి పార్ధసారధిగారి కడుపున పుడతాను. ఆ జలజగారి కొంగులో......."

"షబిల్చండి సార్. జలజగారి కొల్గులో చీదలని ప్రెమాణం చేస్తుల్లాను సార్." వీలయినంత బాధగా అన్నాడు పార్ధసారధి.

"అదొక్కటే తక్కువ. రాజ్యాంగాన్ని తిరగరాయించడానికి తయారైన వారు ఇది మాత్రం ఎందుకు చెయ్యరు?" అన్నారు సిపిఐ వారు. టేబిలు మీద ఒక్క చరుపు చరిచారు రాజుగారు.

"దయచేసి ఇక్కడకూడా దెబ్బలాడుకోకండి. బయట ప్రెస్సు వాళ్లున్నారు. అసలే వాళ్లకి ఇదంతా పండక్కింద ఉంది."

స్పీకరు ఛాంబర్‌లో మరో గంట సమావేశం జరిగింది. సిపిఐ, కాంగ్రెస్, సిపిఐఎం మొదలైన వారంతా ఒక్క విషయం స్పష్టం చేశారు. ఇది క్షమాపణలతో తేలిపోయే వ్యవహారం కాదు. ప్రతిపక్షాలన్నీ రాత్రి ఒక నిర్ణయానికి వస్తాయి. పెద్ద ప్రతిపక్షం కనక మిగతా అందరూ కాంగ్రెస్ వారి నిర్ణయానికి కట్టుబడి ఉంటారు. అందరూ బయటికి వచ్చి ప్రెస్సు వాళ్లని తప్పించుకుని ఎవరి కార్లలో వారు వెళ్లిపోయారు.

. . .

మధ్యాహ్నం మూడవుతూండగా సుబ్బారెడ్డిగారి ఫోన్ మోగింది. ఢిల్లీ నుంచి పార్టీ అధ్యక్షురాలి పి.ఏ. ఆయనతో పది నిముషాలు మాట్లాడేదు. సీల్డు కవరు తీసుకుని విమానంలో మనిషి బయల్దేరేదు. ఫోన్లో ముందుగా తెలియచేస్తే ఉపయోగంగా ఉంటుందని రెడ్డిగారికి వివరించడం అయింది. ఫోను పెట్టేసి రెడ్డిగారు ఉత్సాహంగా ఒళ్లు విరుచుకున్నారు. రాఘవరెడ్డి గారికి స్వయంగా ఫోన్ చేశారాయన. కాంగ్రెస్ వారి నిర్ణయం సముచితంగా ఉన్నదని అంగీకరించారు రెడ్డిగారు.

"కానీ ఒక్క విషయం. ప్రతి పక్షాల నుంచి ఎవరో సీనియర్ నాయకుడికి మాత్రం ఈ అవకాశం ఉంటుంది. మహిళా సభ్యురాళ్లందరి పక్షానా ఒకరుంటారు. మీరు ఏసురత్నం గారికి తెలియచెయ్యండి. నేను స్పీకరు గారితో మాట్లాడతాను" అన్నారు. సుబ్బారెడ్డిగారు. సిగరెట్ వెలిగించి ఆంతరంగికు లందరికీ ఫోన్లు చేసి వెంటనే ఇంటికి రమ్మని తెలియ చేశారాయన. ఇంకొక్క ఫోను చెయ్యక తప్పదు. సుబ్బారెడ్డిగారికి చేతులు రావడం లేదు. కానీ తప్పదు. ఇంక ఎవరిచేత చేయించినా సూరారెడ్డిగారు రాత్రి విమానంలో ఢిల్లీ వెళ్లిపోతారు. పెదరెడ్డిగార్ని అదుపు చెయ్యడానికి సుబ్బారెడ్డిగారు పదేళ్లు శ్రమ పడి విరమించుకున్నారు. అనంతపురం జిల్లాలో ఓడిపోయినా ఢిల్లీలో పట్టు సంపాదించి తనని ఏడిపించుకుతిన్నాడు. సూరారెడ్డిగార్ని తలుచుకోగానే సుబ్బారెడ్డిగారికి షాక్ తగిలినట్టయింది. ఈ గొడవలో మర్చేపోయాడాయన. మూడ్రోజుల్నించీ తీవ్రంగా జలుబు చేసి పెదరెడ్డిగారు సమావేశాలకి రావడం లేదు. అంటే దీని అర్థం ఒకటే. రేపు జరగబోయే గౌరవం సూరారెడ్డిగారికి దక్కుతుంది. అసలీ వ్యవహారం అంతా ఢిల్లీకి తన కంటే ముందే ఆయన చేరవేసి ఉంటాడు. వెంటనే మరో విద్యుద్ఘాతానికి గురయ్యారాయన. ఆలోచించిన కొద్దీ ఆయనకి రెడ్డిగారి కుట్ర అర్థం అయిపోయింది. వెంటనే ఆచార్లు గారికి ఫోన్ చేశారు సుబ్బారెడ్డిగారు. పెద్దరెడ్డిగారి వర్గంలో ఆచార్లు సూక్ష్మరూపంలో తిరుగుతూ ఎప్పటికప్పుడు ఆయన ఎత్తులు ఇటు వేపు చేరవేస్తూంటాడు.

"హలో. నమస్తే అన్నా. నేనే మీకు చేద్దామనుకుంటున్నా. సరే. ఢిల్లీనుంచి ఫోను వచ్చిందా?"

"ఒచ్చింది. అక్కడ ఎలా ఉంది?"

"పెద్దాయనకి ఉదయవే తెలిసిపోయింది. బిగుసుకుపోయాడు. అసలు సంగతి అది గాదన్నా. ఢిల్లీ నుంచి ఫోను రాగానే ఉదయం నుంచీ కషాయాలూ బిళ్లలూ మింగుతున్నాడు. రాత్రి అనంతపురం పోదామని చూస్తున్నాడు."

"దేనికయ్యా?"

"దేనికేంది? జలుబు తగ్గడానికీ, మీ జలుబు కుదరడానికీ. అర్థంగాలే?"

"ఛ. ఎంత గబ్బు మనిషయ్యా. ఎధవ డిసిడెంటు బుద్ధి పోనిచ్చుగున్నాడు గాదు."

సుబ్బారెడ్డిగారికి తప్పదని తెలుసు. విధిలేక ఫోను చేసి కళ్లు మూసుకున్నాడు. సూరారెడ్డి గారు తెల్ల గొంగళిపురుగులా కనిపించారు. రెడ్డిగారి మేనల్లుడు ఎత్తుకున్నాడు. మరు క్షణంలో సూర్రెడ్డిగారి శ్లేష్మకంఠం వినిపించింది.

"హలో"

"నమస్తే. సుబ్బారెడ్డి."

ఢిల్లీ నుంచి రాబోయే సీల్డు కవరు గురించీ, కాంగ్రెస్ అధిష్టాన వర్గం నిర్ణయం గురించీ క్లుప్తంగా చెప్పి రెడ్డిగారన్నారు.

"మీరు దయచేసి గాంధీ భవన్‌కి రావాలి. మీ సహకారం లేకపోతే పార్టీ ప్రతిష్ట నిలవదు. మన సెక్యులర్ పార్టీ లన్నీ ఒక నిర్ణయానికి రావాలి."

"అట్టగే."

"సార్. ఆ... మీ జలుబు ఎలా ఉంది?"

"పరవాలే."

"థాంక్స్ సర్. దయచేసి ఒక్కరోజుకి మందులూ అవీ వేసుకోకండి. పార్టీ కోసం."

"అట్టాగే" అని ఫోను పెట్టేశారు పెదరెడ్డిగారు. నిజానికి ఆయన మందులు మింగడనేగాక నిజంగానే అనంతపురం వెళ్లిపోదావనుకున్నారు. జలుబు చేసిన సీనియర్ నాయకుణ్ణి పిసిసి నిర్లక్ష్యం చేస్తే ఏ వవుతుందో సుబ్బారెడ్డికి తెలిసేలా చెయ్యాలనుకున్నా డాయన. చిన్న గాజు గ్లాసులో కషాయం తీసుకొచ్చి జాగ్రత్తగా ఆయన టేబిలు మీద పెట్టింది రెడ్డిగారి భార్య. గ్లాసువేపు ప్రేమగా చూసి భార్య ముఖం చూస్తూ ఇరవై ఏళ్ల తరువాత చిరునవ్వు నవ్వేరాయన.

తెలుగు దేశం శాసన సభ్యులు ఇరకాటంలో పడ్డారు. మునిరత్నం నాయుడుగారు ఆలోచించి రెండు విషయాలు చెప్పేరు. ఒకటి ఇందులో ముఖ్యమంత్రిగార్ని ఇరికించకూడదు. రెండు బిజెపి వారిని సమర్ధించకూడదు. కానీ వారి ముక్కుపిండక తప్పదు.

"రెండూ ఎలా కుదురుతాయి!" స్పీకరు రాజుగారు ఫోన్లో అడిగేరు.

"ఏవుందీ. కాంగ్రెసోళ్లూ కమ్యూనిస్టులూ ఒక నిర్ణయంతీసుగున్నారుగదా. ఇది శాసనసభ్యుల హక్కులకి సంబంధించిన గొడవ గనక మనం వాళ్లనే సపోర్టు చేస్తాం."

"అదే. ఎలాగని?"

"ఏవుందీ మాలాంటి సీనియర్లు మాత్రం ఉంటారు. ఉన్న కొద్దిమందీ ప్రతి పక్షాల్ని బయటి నుంచీ సమర్ధిస్తారన్నమాటండి"

ఫోను పెట్టెయ్యబోతూ చటుక్కున రాజుగారు అడిగేరు.

"సరే నాయుడూ ఒక ముఖ్య విషయం. మన సభ్యుల్లో ఎవరికేనా జలుబుగాని చేసిందా?"

"లేదుసార్. అందరూ సుబ్రంగా ఉన్నారు గేరంటీ?"

"పోనీలే. పెద్దింటమ్మవారి దయ. ఉంటాను నాయుడూ?"

"కాదండి. జలుబు గురించి అడిగేరు?"

"నీకే తెలుస్తుందిలే."

"నన్ను సస్పెన్సులో పెట్టేత్తన్నారు."

❖ ❖ ❖

గాంధీభవన్‌లో సభ జరుగుతోంది. అప్పటికి సుబ్బారెడ్డిగారు మాట్లాడ్డం అయింది. వేదిక మీద సూరారెడ్డిగారు గంభీరంగా ముక్కుకి రుమాలు అడ్డుపెట్టుకుని కూచున్నారు. సీల్డు కవరు సాయంకాలం విమానంలో వచ్చింది. తెచ్చిన మనిషి సుబ్బారెడ్డిగారితో మామూలుగా, సూరారెడ్డిగారితో చెవిలోనూ మాట్లాడి వెళ్లిపోయాడు. కవరు టేబిలు మీద వెండి పళ్లెంలో పెట్టేరు. ఎవరో దాని మీద గులాబీ పువ్వు కూడా పెట్టేరు. ఒకసారి అందరి వేపూ చూశారు సుబ్బారెడ్డిగారు. ఎవరూ మాట్లాడలేదు. అప్పటికే సీల్డు కవరు అందరి ముందూ తెరవడం, ఆ ఇంగ్లీషు ఉత్తరంలో ముఖ్యాంశాలను రెడ్డిగారు తెలుగులోకి అనువదించడం అయిపోయింది. సూరారెడ్డిగారు చివరి వరకూ ఉత్కంఠ కలిగించారు. మీటింగు మొదలైన రెండు నిముషాలకి కారు దిగే రాయన. తెల్లటి ఆరడుగుల మనిషి. తెల్లటి ఖద్దరు లాల్చీ, పంచ, కండువాలో గాంధీభవన్ మెట్లెక్కి రాగానే పెదరెడ్డిగారు అందరికీ అసమ్మతి తేజంలా గోచరించారు. సుబ్బారెడ్డిగారి ఆంతరంగికులూ ఇతరులూ ఆశగా, ఈర్ష్యగా, ద్వేషంగా ఆయన ముక్కు వేపు చూశారు. ఒక క్షణం రుమాలు తొలిగించి, తెల్లటి ముఖంలో నలిగిపోయిన టోమాటోలా ఉన్న ఆయన ముక్కుని రెడ్డిగారు అందరికీ చూసే అవకాశం కల్పించి వెంటనే రుమాలుతో ముక్కుని చాటేసి నడుస్తోన్న అసమ్మతి గాంభీర్యంలా వేదిక వేపు నడిచా రాయన. కుర్చీలో కూచున్న సూరారెడ్డిగారు తెల్లదుస్తుల్లో, నీలం రుమాలుతో, ఎర్రటి ముక్కు, సగం కాంగ్రెస్ జెండాలా కనిపించారు. సుబ్బారెడ్డిగారు చిరు నవ్వుతో నమస్కరించి, పైకి కనబడని ఆందోళనతో అడిగారు.

"పడిశం ఎలా ఉంది? ఆ... తగ్గలేదు గదా?"

"కొల్చెంగా"

తృప్తిగా నవ్వి ఆయనతో పాటు కూచున్నారు సుబ్బారెడ్డిగారు. పార్టీ కార్యదర్శి లేచి నిలబడి మరొకసారి మర్నాటి కార్యక్రమం గురించి అందరికీ వివరించారు.

" .... అందుచేత కాంగ్రెస్ సభ్యులందరికీ సెక్యులర్ ప్రజాస్వామ్య విలువల మీద ఉండే నమ్మకాన్ని నిరూపించుకునే అవకాశం ఉండదు. కానీ క్రమశిక్షణగల పార్టీ సైనికులం

గనక మనం బాధపడం. దయచేసి మీరు మనసు కష్టపెట్టుకోకండి. మన అధిష్ఠానం నిర్ణయం ప్రకారం మనందరికీ పెద్ద, రాష్ట్రంలోనే గాక దేశంలో, ఒక్క దేశంలో గాక అంతర్జాతీయంగా కూడా సీనియర్ కాంగ్రెస్ నాయకుడు సూరారెడ్డిగారు అసమ్మతిని, అదే, నిరసన తెలియచేస్తారు. మీ కోసం రేపు కార్యక్రమం మరొకసారి గుర్తు చేస్తున్నారు. రేపు సాయంత్రం నాలుగు గంటలకు మనం అంతా అసెంబ్లీ ముందు గాంధీ విగ్రహం ఎదురుగా నిలబడతాం. అలాగే మిగతా పార్టీల వారు కూడా మనతో ఉంటారు. అయితే అందరి కంటే ముందు గాంధీజీ ఎదురుగా ఇద్దరు బీ.జె.పి. శాసన సభ్యులు నిలబడి ఉంటారు. వారి భుజాల మీద నుంచి తెల్లటి మెత్తగా ఉండే ఉత్తరీయులు వేలాడుతూ ఉంటాయి. స్పీకరుగారు అనుమతించగానే ముందు మహిళా సభ్యురాలు, తరువాత మార్క్సిష్టు సభ్యులు ఒకరి తరువాత ఒకరు వెళ్లి వారు ఎంచుకున్న బిజెపి సభ్యుడి ఉత్తరీయంలో శక్తి వంచన లేకుండా ఒకసారి చీదడం జరుగుతుందని మనవి చేస్తున్నాను. ఆ తరువాత మన పార్టీ తరఫున పెద్దలు సూరారెడ్డి గారు వారి స్థాయికి తగ్గట్టుగా చీది వస్తారు. మిత్రులారా ఒక్క విషయం గుర్తు పెట్టుకోండి. ఇవి ఎన్నికలు కావు గనుక మనందరం కలిసికట్టుగా మన రెడ్డిగారు చీదే సమయంలో పెద్ద పెట్టున మహాత్మాగాంధీకీ జై. మతతత్త్వం నశించాలని నినాదాలు చెయ్యాలి. మరొక ముఖ్య విషయం కూడా మీకు మనవి చేస్తున్నాను. మార్క్సిస్టు నాయకులు రాఘవరెడ్డిగారు ఇవాళ నుంచీ రేపు సాయంకాలం వరకూ వారి పార్టీ కార్యదర్శి ఇంట్లో బస చేస్తున్నారు. పార్టీ సెక్రటరీగారికి బాగా జలుబుచేసింది. నిబ్ధతగల నాయకుడిగా రాఘవరెడ్డిగారు రాత్రికయినా జలుబు సోకుతుందనే నమ్మకంతో అక్కడే ఉంటున్నారు. మీలో ఎవరికయినా సందేహాలు ఉంటే అడగొచ్చు."

కరీంనగర్ జిల్లా శాసనసభ్యుడు మెల్లిగా లేచి అడిగాడు.

"సార్, పార్టీ బి.సి, ఎస్.సి, సెల్ తరఫున మాట్లాడతాండాను. సారూ ఈడ సమావేశమ్ జరిగేదాకా బిసి ఎస్‌సి సెల్ వార్ని ఎవరూ అడగలేదు. దీని గురించి కొంచెం సమ్జాయిస్తే బాగుంటది."

కార్యదర్శిగారు అన్నారు.

"మనకి అంతర్గత ప్రజాస్వామ్యం ఉందని మరొక మారు రుజువు అయింది. నిజమే. మైనారిటీ సెల్స్ కూడా మేం సంప్రదించలేదు. దయచేసి అపార్థం చేసుకోవద్దని కోరుతున్నాను" కానీ కరీంనగర్ సభ్యుడు బిసిల్లో కిషన్‌యాదవ్ గారికి బాగా జలుబు చేసిందనీ వారికి కూడా అవకాశం కల్పించవలసిందనీ కోరేడు. అయితే కార్యదర్శి గారు ఇటువంటి రాయితీని ఇస్తే కోస్తా, తెలంగాణా, రాయలసీమ మొదలైన వర్గాలు

కూడా ఏర్పడతాయని చెప్పడంతో సద్దుమణిగింది. పశ్చిమ గోదావరి జిల్లా శాసనసభ్యుడు మరొక ప్రశ్న అడిగాడు.

"ఇప్పుడు అనవసరం అనుకోండి. అయినా తెలుసుకోడం మంచిదని అడుగుతున్నాను. పెద్దలు సూరారెడ్డిగారికి మన అదృష్టం వల్ల తీవ్రంగా జలుబు చేసింది. కానీ అలా జరగని పక్షంలో మన పరిస్థితి ఏమిటి?"

ఈసారి సుబ్బారెడ్డిగారు లేచి అన్నారు:

"దీనికి మనం ఏమీ చెయ్యలేం. నిర్ణయం నాదే అయితే పెద్దవారు గనక సూరారెడ్డిగారే నిరసనగా ఉత్తరీయంలో గట్టిగా తుడుచుకుని వీలయితే చీదడానికి ప్రయత్నిస్తారు. కానీ మన అధ్యక్షురాలి ఉత్తరంలో ఈ విషయం కూడా ఉంది. చదువుతాను వినండి. జస్ట్ ఇన్‌కేస్ అంటేఒకవేళ ఎవరికీ జలుబుచెయ్యని పక్షంలో సీనియర్ సభ్యులు నలుగురైదుగురు ఇవాళ రాత్రి ఎమ్మెల్యే హాస్టల్లో మంచులో చొక్కా విప్పి పడుకోవాలి. ఒక గంటసేపు ముక్కు దగ్గిర అయిసుముక్క పెట్టుకోవాలని సూచించడం జరిగింది."

అందరూ చప్పట్లు కొట్టి కాంగ్రెస్ నాయకత్వం వర్ధిల్లాలని పెద్దగా నినాదాలు చేశారు. అయితే సభ జరుగుతూండగానే బయట పత్రికల వాళ్లకి ఉప్పు అందిపోయింది. మరో పది నిముషాల్లో సభ ముగిసింది. అందరూ లేచి జాతీయ గీతం మొదలు పెట్టేరు. సూరారెడ్డి గారు కూడా లేచి రుమాలు చేతిలో ఉంచుకుని కళ్లు మూసుకుని మంద్రస్థాయిలో గొంతు కలిపేరు: "జలగళమళ...."

❖ ❖ ❖